

1 నుంచి రెవెన్యూ సదస్సులు

గరుగుబిల్లి, ఆగస్టు 28 : గ్రామాల్లో భూముల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేసింది. గ్రామాల వారీగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని ఆదేశించింది. కాగా సదస్సుల నిర్వహణకు తేదీలను ఖరారు చేయనున్నారు. రైతులు తమ భూముల సమస్యలపై వినతులు అందించేలా గ్రామ రెవెన్యూ అధికారులు తగు చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులు ఆయా మండలాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సాగునీటి వనరులకు పూర్వ వైభవం

- నీటి సంఘాలకు జవసత్వాలు
- ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- వైసీపీ హయాంలో సంఘాలన్నీ నిర్వీర్యం
- ఎన్నికలే నిర్వహించని వైనం
- నిర్వహణ లేక దెబ్బతిన్న నీటి వనరులు
- కూటమి సర్కారు తాజా నిర్ణయంతో రైతుల హర్షం

పార్వతీపురం, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే ఎన్నికలు జరపాలని నిశ్చయించింది. వాస్తవంగా గత ఐదేళ్లలో ఈ సంఘాలే లేకపోవడంతో నిర్వహణ కరువై నీటి వనరులు దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఈ సంఘాలకు తిరిగి ఊపిరులూదడం ద్వారా నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కూటమి సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు అంగీకారం తెలిపింది. దీనికి మంత్రి వర్గం కూడా ఆమోదం తెలిపింది. ప్రభుత్వం తాజా నిర్ణయంతో జిల్లాలో సాగునీటి వనరులకు పూర్వ వైభవం రానుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ పాలనలో..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలు నిర్వీర్యమైపోయాయి. ఐదేళ్ల కాలంలో ఎన్నికలే జరపలేదు. దీంతో కార్యవర్గాలు, నిర్వహణ లేక.. జిల్లాలో సాగునీటి సంఘాలు నిస్తేజంగా మారాయి. మరోవైపు పూడికతీత పనులు, మరమ్మతులు, కాలువ గట్ల బలోపేతం వంటి క్షేత్ర స్థాయి ముఖ్యమైన పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రాజెక్టులు, చెరువులకు సంబంధించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందని పరిస్థితి. మరోవైపు నీటి తీరువా వసూలు కూడా ఆగిపోయింది. నీటి వనరుల యాజమాన్య నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో అవన్నీ పాడైపోయాయి. కనీసం గ్రీజురాసి గేట్లు ఎత్తేవారు కూడా కరువయ్యారు. మొత్తంగా సాగునీటి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగితే ఇక్కట్లు తొలగనున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. కాగా చెరువు కింద వంద ఎకరాల పైబడి ఆయకట్టు ఉంటేనే ఎన్నికలు నిర్వహించనున్నారు.



గుర్రపు డెక్కతో నిండిన గొల్లివలసలోని ఊర చెరువు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

- గత తెలుగుదేశం ప్రభుత్వం కాలంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవారు. ఆయా సాగునీటి సంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో చెరువులతో పాటు ప్రాజెక్టుల వద్ద రైతులకు అవసరమైన పనులు చేపట్టేవారు. ఈ సంఘాలు నీటి తీరువా వసూలు చేసి నీటి వనరుల నిర్వహణకు ఖర్చుచేసేవి. చెరువులు, కాలువలు, ఆయకట్టు పరిధిలో ఏ చిన్న సమస్య వచ్చినా నీటి సంఘాల ప్రతినిధులు స్పందించేవారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టే వారు. అయితే గత ఐదేళ్లుగా ఆ పరిస్థితి లేదు.
- గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రైతులు సభ్యులుగా ఉండే కమిటీలకు రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగేవి. ఏకగ్రీవంగా ఎన్నుకునే ఈ సంఘాలకు ప్రభుత్వం ప్రత్యేక నగదు ప్రోత్సాహకం ఇచ్చేది. ఈ నగదుతో అవి పూడికతీత పనులు, కాలువ గట్ల మరమ్మతులు చేపట్టేవి. కానీ వైసీపీ హయాంలో నిర్వీర్యం చేశారు.

జిల్లాలో పరిస్థితి ఇది...

జిల్లాలో 37 ప్రాజెక్టులు, 183 సంఘాలు ఉన్నాయి. తోటపల్లితో పాటు వీఆర్ఎస్, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ, జంఝావతి, పెదంకలం తదితర ప్రాజెక్టులుండగా.. వాటి పరిధిలో వేలాదిగా చెరువులు, వాగులు, వంకలు ఉన్నాయి. కాగా గతంలో ఆయా ప్రాజెక్టుల పరిధిలో నీటి సంఘాలు ఉండేవి. ఆయకట్టుదారుల సమస్యలను పరిష్కరిస్తూ అండగా ఉండేవి. అంతేకాదు ప్రాజెక్టులకు మంజూరయ్యే నిధుల్లో కొంతమొత్తాన్ని నీటి సంఘాలకు కేటాయించి రైతుల పర్యవేక్షణలో పనులు జరిగేవి. నీటి సంఘాల ఆధ్వర్యంలో నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు జరిగేవి. దీంతో రైతులకు సాగునీటి సమస్యలు ఉండేవి కావు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆమోదం తెలపడంతో నీటి వనరుల నిర్వహణకు ఎలాంటి ఢోకా ఉండదని రైతులు అంటున్నారు.



గరుగుబిల్లి: తురకనాయుడువలస సమీపంలో తోటపల్లి ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ఇలా..

హర్షణీయం..

సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. గ్రామాల పరిధిలో సాగునీటి సంఘాలు ఉండడం వల్ల రైతుల సమస్యలు పరిష్కారం కానున్నాయి. వైసీపీ ప్రభుత్వ కాలంలో సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ప్రాజెక్టుల నిర్వహణ గాడి తప్పింది. సాగునీటి సమస్యలతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం హర్షణీయం.

-చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు, పార్వతీపురం

గిరిజన విద్యార్థులను పట్టించుకోరా?

- శ్రీకాకుళం జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన పాలకొండ ఎమ్మెల్యే

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఉమ్మడి జిల్లాలో ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను శ్రీకాకుళం జడ్పీ సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా బుధవారం శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ..' వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఇటీవల గిరిజన విద్యార్థులు విషజ్వరాలతో మృతిచెందారు. ఇదేరీతిన బీసీ విద్యార్థులు మరణించి ఉంటే ఆ వర్గ ఎమ్మెల్యేలు ఊరుకునేవారా?. అధికారులు ఆగేవారా? గిరిజన విద్యార్థులను పట్టించుకోరా?. మలేరియాతో ఎంతమంది మరణించారో నివేదిక ఉందా?. పాలకొండ నియోజకవర్గంలో శివారు భూములకు సాగునీరు అందడంలేదు. ఇరిగేషన్ అధికారులు శ్రీకాకుళంలో కొంతమంది, బొబ్బిలిలో మరికొంత మంది ఉంటున్నారు. వరదలు సంభవించకుండా పూర్తిగా చర్యలు తీసుకోవడం లేదు. భామిని మండలంలో 43 మంది రైతులకు రూ.14 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాల్సిఉంది. సీతంపేట ఐటీడీఏలోని డీడీ ఆఫీసును శ్రీకాకుళానికి తరలిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఇందులో నిజమెంతో కలెక్టరే బదులివ్వాలి.' అని ఆయన కోరారు.

తరలిపోతున్నాయ్..

- ఐటీడీఏ నుంచి పొరుగు జిల్లాకు కార్యాలయాలు
- కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి
- సీతంపేటలో నామమాత్రంగా కొన్ని శాఖలు
- మరికొన్ని ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం
- పీవో సింగిల్ లైన్ పాలనకు బ్రేకులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

సీతంపేట: ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ పాలకులు మారడం సహజం. కానీ ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోవడం ఎక్కడైనా చూశారా? సీతంపేట ఐటీడీఏలో మాత్రం అదే జరుగుతోంది. గడిచిన కొన్నేళ్లుగా ఐటీడీఏ కేంద్రంగా నిర్వహిస్తున్న కీలకశాఖలు ఒక్కొక్కటిగా పొరుగు జిల్లాకు తరలిపోతున్నాయి. దీంతో ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల విభజనకు ముందు సీతంపేట ఐటీడీఏలో ఉండే డీఎంవో కార్యాలయం, చిన్నతరహా నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, విద్యుత్‌శాఖ ఏడీఈ, గృహ నిర్మాణశాఖ డీఈ, గ్రామీణ నీటి సరఫరా, డీ సెరీకల్చర్ ఏడీ కార్యాలయాలను వివిధ కారణాలతో శ్రీకాకుళం జిల్లాకు తరలించారు. తాజాగా గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నామమాత్రంగానే..

- సీతంపేటలో జీసీసీ డివిజనల్ మేనేజర్ కార్యాలయం ఉంది. అయితే గత నాలుగు నెలలుగా డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి లేరు. ఆమెకు విశాఖ పట్నంలో జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో డీఎం కార్యాలయం నామమాత్రంగానే మారింది. ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి, ఉపవైద్య అధికారి ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ఐటీడీఏ పీవో సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేటివ్ కొంతవరకు బ్రేక్‌లు పడినట్టు స్పష్టమవుతుంది.
- ఐటీడీఏలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమానికి, సమావేశాలకు జిల్లా కేంద్రాల నుంచి అధికారులు వచ్చి వెళ్తున్నారు తప్ప.. పూర్తిస్థాయిలో సంక్షేమ కార్యక్రమాలపై దృష్టిసారించడం లేదు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు.
- మరోవైపు ఐటీడీఏ కేంద్రంగా ఏర్పాటు చేసిన కీలక శాఖలు ఒక్కొక్కటిగా శ్రీకాకుళం తరలిపోతుండడాన్ని ఆదివాసీలు జీర్ణించుకోలేకపోతున్నారు. స్థానికంగా కార్యాలయాలు లేకపోవడం వల్ల తమ సమస్యల పరిష్కారానికి గాను పొరుగు జిల్లాకు వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట మన్యంలో మలేరియా కేసులు అధికంగా నమోదువుతున్నప్పటికీ డీఎంవో కార్యాలయం స్థానికంగా లేదు. దీంతో సంబంధిత రక్త పరీక్షలు స్థానికంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందని గిరిజనులు వాపోతున్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంద రోజుల ప్రణాళికలపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆ స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగడంపై మన్యం వాసులు మండిపడుతున్నారు. దీనిపై కూటమి సర్కారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలకు సిద్ధం చేయండి: డీఎస్పీ



ఇసుక తరలింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

భామిని: కాట్రగడ వరద కాలువ ముఖద్వారం వద్ద మేట వేసిన ఇసుక తవ్వకాలకు సిద్ధం చేయాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. బుధవారం కాట్రగడ వరదకాలువ ఓపెన్‌హెడ్ ప్రాంతం, ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఏబీ రోడ్డు రహదారి పరిస్థితిని పరిశీలించారు. స్టాక్ పాయింట్ నేరడి బ్యారేజ్ సెంటర్ వద్ద షెడ్లు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు సూచించారు. కాట్రగడ నుంచి ఏబీ రోడ్డు వరకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. తహసీల్దార్ స్పందిస్తూ.. ఇప్పటికే రహదారి పనులు చేపడుతున్నామన్నారు. రేపటి నుంచి ఓపెన్‌హెడ్ చానెల్ వద్ద ఇసుక తవ్వకాలకు ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే స్టాక్ పాయింట్‌కు ఇసుక తరలిస్తామని చెప్పారు. సీఐ చంద్రమౌళి, బత్తిలి ఎస్ఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30న హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

పార్వతీపురం, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 30న రెడ్ రన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి ఎం.వినోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకు ఆర్‌సీఎం స్కూల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ వలంటీర్లు పాల్గొంటారని వెల్లడించారు.

జీవనోపాధికి చర్యలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీవనోపాధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. అర్హులైన గిరిజనులకు ట్రైకార్ ద్వారా రుణాలు అందించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి జాబ్‌మేళాలు నిర్వహించి ఏడాదిలో ఐదు వేల మందికి ఉద్యోగావకాలు కల్పించాలని ఆదేశించారు. నిరంతరం శిక్షణ కార్య క్రమాలు జరగాలన్నారు. చేనేత కార్మికులకు కూడా నైపుణ్య శిక్షణ అందించాలని సూచించారు.

- జిల్లాలో కనీసం పది లక్షల మొక్కలు పెంచాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అటవీశాఖాధికారులను ఆదేశించారు. వాటికి అవసరమైన నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ నెల 30న వన మహోత్సవాన్ని నిర్వహించాలని ఆదేశించారు. డీఎఫ్‌వో ప్రసూన మాట్లాడుతూ... సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో వన మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.
- ప్రజా ఫిర్యాదు లను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. అర్జీదారునికి ఫోన్ చేయాలని, వీలైతే సంబంధిత అధికారి వినతులు ఇచ్చిన వారిని కలిసి సమస్యలను పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సదరం సర్టిఫికెట్లపై అవగాహన కల్పించాలన్నారు.

16 పనిచేయట్లే.. 35 బయట శాఖలకు ..

- ఐదేళ్లయినా.. తిరిగి రాలే...
- సీతంపేట వైటీసీలో ల్యాప్‌ట్యాప్‌ల లొల్లి...
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు
- గిరిజన యువత శిక్షణ కోసం పంపిణీ
- వైసీపీ అధికారంలోకి వచ్చిన మారిన పరిస్థితి
- పీవోల ఆదేశాల మేరకు బయటకు శాఖలకు ఇచ్చిన వైనం
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



వైటీసీలో నిరుపయోగంగా పడి ఉన్న ల్యాప్‌ట్యాప్‌లు

సీతంపేట రూరల్, ఆగస్టు 28: సీతంపేట వైటీసీలో విలువైన ల్యాప్‌ట్యాప్‌లు ఏమయ్యాయో.. తెలియని పరిస్థితి నెలకొంది. గిరిజన యువతకు వివిధ రకాల శిక్షణల కోసం వినియోగించాల్సిన వాటిని బయట శాఖలకు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్)లను ఏర్పాటు చేశారు. వైటీసీలో శిక్షణలకు అవసరమైన ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ప్రొజెక్టర్‌లు, స్క్రీన్‌లను పంపిణీ చేశారు. అప్పట్లో ఈ కేంద్రాల్లో యువతకు ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. కాగా 2019లో ఎన్నికలకు ముందు సీతంపేట వైటీసీకి 51 ల్యాప్‌ట్యాప్‌లు, 20 కంప్యూటర్‌లు, నాలుగు ప్రొజెక్టర్‌లు మరో నాలుగు స్క్రీన్‌లను అందించారు. కాగా 51 ల్యాప్‌ట్యాప్‌ల్లో 16 మూలన పడ్డాయి. మిగిలిన 35 ల్యాప్‌ట్యాప్‌ల జాడ నేటికీ కనిపించడం లేదు. ఐటీడీఏ పీవోల అనుమతితో గత ఐదేళ్ల కాలంలో శాఖల వారీగా వాటిని ఇచ్చినట్లు వైటీసీ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే వైటీసీ నుంచి బయటకు వెళ్లిన ల్యాప్‌టాప్‌లు ఏమయ్యాయో తెలడం లేదు. ఐటీడీఏ పీవోల ఆదేశాల మేరకు రెవెన్యు, ఐటీడీఏ, పాలకొండ ఆర్డీవో, ఆర్‌వోఎఫ్ఆర్ వంటి శాఖలకు ల్యాప్‌టాప్‌లు వెళ్లినట్లు వైటీసీ రికార్డుల్లో ఉంది. ఏదేమైనా గిరిజన యువత శిక్షణల కోసం అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసిన వాటిని ఈ విధంగా వేరే శాఖలకు తరలించడంపై స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సీతంపేట వైటీసీ భవనం

వైటీసీ మేనేజర్ ఏమన్నారంటే..

'నేను వైటీసీ మేనేజర్‌గా చార్జి తీసుకున్న నాటికి 51 ల్యాప్‌టాప్‌లు ఉండేవి. అయితే ఐటీడీఏ పీవోల ఆదేశాల మేరకు వాటిని పలు శాఖలకు ఇచ్చాం. బయటకు ఇచ్చిన ప్రతి ల్యాప్‌ట్యాప్‌కి సంబంధించి ఎక్నాలెడ్జ్‌మెంట్ ఉంది. వాటిని తిరిగి ఇవ్వాలని ఆయా శాఖల అధికారులకు చెబుతున్నాం. అయితే ఇంత వరకు ఎవరూ తెచ్చి ఇవ్వలేదు' అని వైటీసీ మేనేజర్ వెంకటరమణ తెలిపారు.

పోటా పోటీగా..

- బదిలీల కోసం కొంతమంది అధికారుల పైరవీలు
- ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల హవా

పార్వతీపురం, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బదిలీల జాతర కొనసాగుతున్న నేపథ్యంలో కొంతమంది అధికారులు, ఉద్యోగులు పోటాపోటీగా పైరవీలు సాగిస్తున్నారు. తమకు కావాల్సిన స్థానాల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే సమయంలో కొంతమంది సిఫారసు లెటర్లతో పాటు ఎమ్మెల్యేలతో నేరుగా తమ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఏ స్థానంలో ఎవరు ఉండాలి.. ఎవరిని కొనసాగించుకోవాలనే దానిపై ద్వితీయ శ్రేణి నాయకులు సిఫారసులు చేస్తూ.. ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు కూడా పరోక్షంగా వారికి సహకారాన్ని అందిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు సూచనల మేరకే గ్రామ, మండల స్థాయిల్లో అధికారులు బదిలీలు జరుగుతున్నాయని చెప్పొచ్చు. అయితే వైసీపీ హయాంలోనే మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ బదిలీలు జరుగుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ పాలనలో ఫలానా అధికారి, ఫలానా సిబ్బందిని అక్కడే కొనసాగించాలని డైరెక్ట్‌గా అధికారులకు ఆ పార్టీ నాయకులు హుకుం జారీ చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోయినప్పటికీ ఏ అధికారిని ఎక్కడ ఉంచాలో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు సూచిస్తున్నారు. దీంతో వారి కోరిక మేరకు కొంతమంది ఎమ్మెల్యేలు అంతర్గతంగా ఉన్నతాధికారులకు సిఫారసులు చేస్తున్నారు. అయితే ఒక్కో స్థానానికి ఇద్దరు లేదా ముగ్గురేసి చొప్పున అధికారులు పోటీ పడుతుండంతో ఎవరికి ప్రాధాన్యం ఇవ్వాలో.. ఏ నాయకుడి సిఫారసుకు ఆమోద ముద్ర వేయాలో తెలియని పరిస్థితి కొంతమంది ఎమ్మెల్యేలకు ఏర్పడింది. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు.

ఆ ముద్ర పడే అవకాశం..

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో అవినీతి అధికారులుగా ముద్రపడిన సిబ్బంది, అధికారుల బదిలీల సిఫారసుల విషయంలో ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. తాజాగా వారంతా టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా.. అవినీతి అధికారులకు మద్దతు ఇచ్చే వారిగా ముద్రపడే పరిస్థితి ఉంది. ద్వితీయ శ్రేణి నాయకులు ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ... సమర్థులు, నిజాయితీగా పనిచేసే అధికారులకే పెద్దపీట వేయాలి. లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుంది. ప్రజల నుంచి కూడా వ్యతిరేకతను మూటగట్టుకోక తప్పదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్‌ఆర్‌ఐ సెకండ్ ఫేజ్



అడ్మిషన్స్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్‌ఆర్‌ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, ... ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి

ఏసీఎస్ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

● మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions

రిమైండర్

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** సెప్టెంబరు 2న
- **ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** సెప్టెంబరు 5
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AxmEvBlలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

హీరోగా మారిన విలన్ కథ ఇది




నేను 'మగధీర' చిత్రానికి కో డైరెక్టర్‌గా పని చేశా. ఆ సమయంలోనే దేవ్ గిల్‌తో పరిచయం ఏర్పడింది. దేవ్ ఈ సినిమా ప్రపోజల్‌తో వచ్చాడు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అన్నారు దర్శకుడు త్రికోటి. దేవ్ గిల్ హీరోగా నటించిన 'అహో విక్రమార్క' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నెల 30న ఆ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో దేవ్ గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ అనీ, మదర్ సెంటిమెంట్ కూడా ఉందనీ ఆయన తెలిపారు.

రచయిత నరసింగరావు కన్నుమూత



కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబి', రామ్‌గోపాల్ వర్మ 'అనగనగా ఒకరోజు' లాంటి పలు హిట్ చిత్రాలకు మాటల రచయితగా పనిచేసిన నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కౌంట్‌డౌన్ మొదలు



ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పుష్ప 2 ది రూల్' చిత్రం విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. మరో వంద రోజుల్లో అంటే డిసెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ పేర్కొంటూ పోస్టర్ విడుదల చేశారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరో వైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంతో జరుగుతున్నాయి. 'కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా 'పుష్ప 2' అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. మీరు ఎంత ఎక్స్‌పెక్ట్ చేసినా అంతకు మించి 'తగ్గేదేలే' అనిపించే రీతిలో సినిమా ఉంటుంది' అని దర్శకనిర్మాతలు చెప్పారు. దేవిశ్రీప్రసాద్ పాటలు అలరిస్తాయని తెలిపారు.

అందరి పేర్లు బయటపెట్టాలి



మలయాళ చిత్ర ప్రముఖులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్‌ఈఎఫ్‌కేఏ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ) దర్శకుల సంఘం ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. జస్టిస్ హేమ కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడిన అందరి పేర్లను బయట పెట్టాలంటూ ఎఫ్‌ఈఎఫ్‌కేఏ దర్శకుల సంఘం డిమాండ్ చేసింది. "ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువ మాట్లాడాలనుకోవడం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ అందరి పేర్లు బయటకి రావాలి. దోషులకు కఠిన శిక్ష పడాలి. నిందితులలో మా సంఘం సభ్యులున్నా.. మేం కలుగజేసుకోం" అని పేర్కొంది.

సిద్ధిఖీపై కేసు

మలయాళ నటుడు సిద్ధిఖీపై నటి రేవతి సంపత్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. అలాగే, బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు ఇండస్ట్రీలో మరీ ఎక్కువ

నటి షకీలా తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "లైంగిక వేధింపులు కేవలం మలయాళ చిత్రసీమలోనే కాదు.. తమిళ ఇండస్ట్రీలోనూ ఉన్నాయి. తెలుగు ఇండస్ట్రీలో అయితే మరీ ఎక్కువగా ఉన్నాయి. అడ్జస్ట్‌మెంట్లు, కమిట్‌మెంట్ల గురించి మేనేజర్లు ముందే అడుగుతారు" అని ఆరోపించారు.

నోరు విప్పితే ట్రబుల్‌మేకర్స్ ముద్ర

హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వర భాస్కర్. "హేమ కమిటీలో వెలువడిన చీకటి వాస్తవాలు చూసి షాకయ్యా. బాధితులు ఎవరైనా ఏ విషయంపై అయినా నోరు తెరచి మాట్లాడితే వారిని ట్రబుల్‌మేకర్స్‌గా ముద్ర వేస్తారు" అని స్వర భాస్కర్ పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలోనూ మహిళలు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొంటున్నారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అన్నారు. వేధింపులను వెలుగులోకి తెచ్చేందుకు హేమ కమిటీ రిపోర్ట్ ఉపయోగపడిందన్నారు. ఈ నివేదిక మనలో మార్పు తీసుకురావాలి అని ఆమె ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్

గన్నా.. గర్ల్!



శ్రీ సింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'మత్తు వదలరా' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. రితేశ్ రానా దర్శకత్వంలో చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్ర పోషిస్తున్నారు. గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఫరియా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సునీల్, వెన్నెల కిశోర్, అజయ్, రోహిణి తదితరులు నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది.

సెప్టెంబర్‌లో జిగేల్



త్రిగుణ్, మేఘనా చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సెప్టెంబర్‌లో 'జిగేల్' చిత్రాన్ని విడుదల చేస్తాం. యువతను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది' అని నిర్మాతలు చెప్పారు. రఘుబాబు, పృథ్వీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఆనంద్ మంత్ర

నీలి మేఘములలో...



రానా దగ్గుబాటి సమర్పణలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం సెప్టెంబర్ 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. లీడ్ పెయిర్ జర్నీని అందంగా ఆవిష్కరిస్తూ భరద్వాజ్ గాలి రాసిన 'నీలి మేఘములలో' పాటను బుధవారం విడుదల చేశారు. వివేక్ సాగర్ ఈ గీతానికి స్వరాలు అందించారు.

ప్రేమికుడి వీక్షణం



యువ కథానాయకుడు రామ్ కార్తీక్ హీరోగా, కశ్వి హీరోయిన్‌గా నటించిన 'వీక్షణం' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం సిద్ శ్రీరామ్ పాడిన 'ఎన్నెన్నో' పాటను విడుదల చేశారు. ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసుని ఆవిష్కరించే ఈ పాటను రెహ్మాన్ రాయగా, సమర్థ్ గొల్లపూడి స్వరాలు సమకూర్చారు.

సాధనకు దీక్ష అవసరం



తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటించిన ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం.' అని కోరారు. ఒక మంచి సినిమాలో అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో, హీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు పలుకు.. తేనెలొలుకు



- వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన గిడుగు
- నేడు మాతృభాష దినోత్సవం

రాజాం రూరల్, ఆగస్టు 28: మాతృభాషలో మాట్లాడడమే నాకు మహదానందం అంటూ తెలుగులోనే అందరూ మాట్లాడాలని మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు కోరేవారు.. దేశ భాషలందు తెలుగు లెస్స.. అని విజయనగర రాజులు కృష్ణదేవరాయలు చాటారు.. తెలుగుజాతి మనది..నిండుగ వెలుగు జాతి మనది... అమ్మలోని కమ్మదనం చక్కని తేడుపెరుగు తెలుగు... ఘనకీర్తి పొందిన తెలుగు తీయదనం మనది.. అంటూ వివిధ కవులు తెలుగు గురించి అపూర్వంగా వర్ణించారు. మాతృభాషను నేర్వలేనివాడు ఇతర భాషలను సంపూర్ణంగా నేర్చుకోలేరని కవి సామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ మాటలు అక్షరసత్యాలు. తెలుగు సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి గ్రాంధిక స్థానంలో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి రోజునే మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్..

తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా వెనిస్ దేశస్థుడు నికోల్ డీ కంటి అభివర్ణించారు. తెలుగు భాషలో ప్రతి వాక్యం అచ్చు శబ్దంతో ముగుస్తుంది. ఈ ప్రత్యేకత ఇటలీ భాషకు మాత్రమే ఉంది. అందుకే ఇటలీ, తెలుగు భాషలను అజంత భాషలంటారు. ఇతర భాషలన్నీ హల్లు శబ్దంతో అంతమవుతాయి.

ఆంగ్లమే ప్రాధాన్యం కాదు..



పోటీ ప్రపంచంలో ఆంగ్లం తప్పనిసరి. అంతమాత్రాన తెలుగును విస్మరించకూడదు. మాతృభాషలో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారు వేలల్లో ఉన్నారు. తమిళనాడు ప్రభుత్వం మాతృభాషను అమలు చేయడంలో ఎంతో ఆదర్శంగా నిలిచింది. మనం కూడా అదేమార్గాన్ని అనుసరించాలి. ఇళ్లల్లో పిల్లలు అమ్మా, నాన్నా అనడమే మానేశారు. ఇది చాలా బాధాకరం.

-రంగనాథం, విశ్రాంత తెలుగు పండితుడు, రాజాం

పోతన భాగవతంపై ఊరూరా ప్రచారం..

బొబ్బిలి ఆగస్టు 28: రాముడువలసకు చెందిన **బోదనపల్లి గౌరీనృసింహ ప్రసాదశర్మ** ఊరూరా పోతన భాగవతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈయన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారపరిషత్ తరఫున ఉపన్యాసకులుగా కూడా



వ్యవహరిస్తున్నారు. పామరులకు సైతం సులభంగా అర్థమయ్యే రీతిలో పోతనామాత్యులు భాగవతాన్ని ఆంధ్రీకరించారని నిరంతరం నేటి తరం యువకులకు గుర్తుచేస్తుంటారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని, మాధుర్యాన్ని, గొప్పతనాన్ని గ్రామీణ ప్రాంతాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా చాటి చెబుతున్నారు. ఇందుకుగాను ఆయనకు టీటీడీ 2015లో ప్రత్యేక అవార్డును ప్రదానం చేసింది.

తెలుగుపై ఎన్నో రచనలు..



బొబ్బిలి పట్టణంలోని నాయుడుకాలనీకి చెందిన **మీసాల చినగౌరునాయుడు** ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో లెక్కలు మాస్టారుగా పనిచేస్తున్నారు. తెలుగుభాషపై అమితమైన ప్రేమ, అభిమానంతో అనేక రచనలు చేస్తున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో పలు అవార్డులు అందుకున్నారు. స్వతహాగా కళాకారుడు అయిన గౌరునాయుడు తెలుగుభాష అజరామరమైనదని, ఆ భాష ఔన్నత్యం ప్రపంచస్థాయిలో గుర్తించబడిందన్నారు.



ఆకట్టుకుంటున్న చంద్రరావు కార్టూన్..

కొత్తవలస, ఆగస్టు 28: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కంటకాపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రేమచంద్రరావు తెలుగుభాష పరిస్థితిపై కార్టూన్ వేశారు. ఇంగ్లీష్ భాష మోజులో పడి తెలుగు భాషను తెలుగు వారు సైతం విస్మరిస్తున్నారని, అమ్మ భాష తెలుగును కాపాడుకోవాలంటూ పిలుపునిస్తూ కార్టూన్‌ను చిత్రీకరించారు.

తెలుగు భాషపై చంద్రరావు కార్టూన్

హత్య కేసులో ఆరుగురికి యావజ్జీవం

బెలగాం: ఓ హత్య కేసులో ఆరుగురు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు తీర్పు వెల్లడించారని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో యామక గౌరీశంకర్‌ను ఆయన భార్య సరస్వతి కొంతమంది వ్యక్తులతో కలిసి తోటపల్లి ఐటీడీఏ పార్క్ వద్ద పథకం ప్రకారం హత్య చేయించిందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు పథకం ప్రకారం హత్య చేయించినట్లు నేరం రుజువు కావడంతో భార్యతో పాటు ఆరుగురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.1100 చొప్పున జరిమానా కోర్టు విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భోగాపురం: డెంకాడ మండలంలోని జొన్నాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గొలగాన అప్పలరాజు(51) మంగళవారం రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తవుడు తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. డెంకాడ మండలంలోని జొన్నాడ పంచాయతీ మన్యాలపేట గ్రామానికి చెందిన గొలగాన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దాకమర్రికి చెందిన చెల్లూరుసంతోష్‌కు సిమెంట్ ఇటుక బ్రిక్స్ నిర్వ హిస్తున్నాడు. భోగాపురం మండలంలోని లింగాలవలసకు సిమెంట్ ఇటుకలు పంపి ంచవలసి ఉంది. అయితే సిమెంట్ బ్రిక్స్ ట్రాక్టర్‌కు చెందిన డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో ఆప్‌టింగ్ డ్రైవర్ గొలగాన అప్పలరాజుతో ఈనెల 21న లోడుతో కూడిన ట్రాక్టర్‌ను డెంకాడ మండలంలోని జొన్నాడ నుంచి భోగాపురం మండ లంలోని లింగాలవలసకు పంపించారు. ఆ సమయంలో శ్రీకా కుళం నుంచి విశాఖ వైపు వెళ్లె సర్వీస్ రహదారిలో ట్రాక్టర్ లింగాలవలస వైపు వెళ్తోంది. అదే రహదారిలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు సర్వీస్ రహదారిలో ఆటో వ స్తోంది. అయితే లింగాలవలస సమీపంలో సర్వీస్ రహదారిలో ఆటో ఎదురుగా రావడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ కింద అప్పలరాజు పడిపోవడంతో తీ వ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో చేర్చా రు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అప్పలరా జు అక్కడ చికి పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అప్పలరాజుకు భార్యఅప్పయ్యమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాక్టర్ యజమాని చెల్లూరు సంతోష్ ఫిర్యాదు మేరకు సీఐ ఎన్వీ ప్రభాకరరావు ఆదేశాల మేరకు కేసు నమోదుచేశారు.

గరుడబిల్లిలో ఒకరి ఆత్మహత్య

బొండపల్లి: భార్య మందలించిందని మనస్తాపంతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ మ హేష్ బుధవారం తెలిపారు. మండలంలో గరుడబిల్లి గ్రామా నికి చెందిన మజ్జి శ్రీదేవి తన భర్త శ్రీరామ్‌ను మద్యం తాగి రావడంతో బుధవారం మందలించిందని తెలిపారు. మనస్తాపానికి గురైన శ్రీరామ్ పురుగుల మందు తాగినట్లు చెప్పారు. ఈమేరకు ఆసుపత్రికిలో చికిత్స పొందు తూ శ్రీరామ్ మృతిచెందినట్లు తెలిపారు. శ్రీరామ్‌కు కుమారుడు, కుమార్తె ఉ న్నారు. ఈ మేరకు ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదుచేశారు.

నలుగురికి గాయాలు

కొమరాడ/కురుపాం: కొమరాడ మండలంలోని కెమిశీల నుంచి కురుపాం వస్తున్న ఆటో, కెమిశీల వైపు వెళ్తున్న ఆటో తులసివలస గ్రామ సమీపంలో ఎదురె దురుగా ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. మొదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే జూమ్ మీటింగ్‌కు వెళ్తున్న గుణద, బిన్నిడి, గుణద తీలేసు ఆశా కార్యకర్తలు ఎం.లక్ష్మి, ఎం.మిం దమ్మ, కిడగమ్మ, కురుపాం వెళ్లేందుకు ఆటో ఎక్కిన గొరడ గ్రామానికి చెందిన చంద్రయ్య గాయపడ్డారు. కురుపాం పీహెచ్‌సీకి తరలించగా అక్కడి పోలీసులు కేసు నమోదుచేశారు. కాగా ఈ మేరరకు కొమరాడ ఎస్ఐ నీలకంఠం కేసు నమోదుచేశారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

- ఒంటరి మహిళలను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడిన వైనం

గాజువాక (విశాఖపట్నం), ఆగస్టు 28: ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకుని వారిని మాయ మాటలతో నమ్మించి మత్తు మందు ఇచ్చి నగదు, బంగారు ఆభరణాలను కాజేస్తున్న కొట్టిన లక్ష్మణనాయుడు అనే అంతర్ జిల్లాల దొంగను విశాఖలోని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 24న వడ్లపూడి ప్రధాన మార్గంలో కూరగాయలు విక్రయించే ఓ మహిళ వద్దకు లక్ష్మణనాయుడు వచ్చి మాటలు కలిపాడు. అనంతరం అక్కడ ఉన్న షాపు నుంచి చెరకు రసం తెచ్చి ఆమెకు ఇచ్చాడు. అది తాగాక ఆమె ఇంటికి వెళ్లి అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆ మర్నాడు ఉదయం లేచి చూసేసరికి ఆమె మెడలో ఉండాల్సిన బంగారు గొలుసు, ఇతర ఆభరణాలు, బీరువాలోని బంగారు వస్తువులు, నగదు, ఏటీఎం కార్డు కనిపించలేదు. దీంతో తమ ఇంట్లో రాత్రి దొంగతనం జరిగిందంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటువంటి నేరాలు ఇటీవల నగరంలో అధికమవుతున్నట్టు గుర్తించిన పోలీస్ ఉన్నతాధికారులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. క్రైమ్ డీసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ డివిజన్ క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. కూరగాయల దుకాణం వద్దకు వ్యక్తి గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు శ్రీకాకుళం జిల్లా పాలకొండ సమీపంలోని బాసుర ప్రాంతానికి చెందిన కొట్టిన లక్ష్మణనాయుడుగా గుర్తించారు. ఈ క్రమంలో లక్ష్మణనాయుడు మంగళవారం ఇక్కడి రాజీవ్‌నగర్ బ్రిడ్జి వద్ద ఉన్నట్టు పోలీసులు గుర్తించి అదుపు లోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి బంగారు చైను, మూడు తులాల ఇతర ఆభరణాలు, కొన్ని ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇప్పటికే నిందితుడిపై గాజువాక, పెందుర్తి, విశాఖ టూ టౌన్, విజయనగరం, కాకినాడ జిల్లా సామర్లకోట, అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట, శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి.

ఇసుక అక్రమరవాణాను ఉపేక్షించేదిలేదు

బొబ్బిలి: ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడిచే విధంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అలజంగి, కారాడ, పారాది తదితర వేగావతి నదీ పరివాహక ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణా అవకుండా గట్టి నిఘా పెట్టామన్నారు. అర్ధరాత్రివేళల్లో ఎటువంటి అక్రమరవాణా జరిగినా వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. స్థానిక గ్రోత్‌సెంటరులో గల ప్రభుత్వ ఇసుకస్టాకు పాయింట్‌లో వాహనాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా ఇసుకపంపిణీ జరిగేలా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాజాం రూరల్: రాజాం రూరల్ సర్కిల్ పరిధిలోని రేగిడి, వంగర, సంతకవిటి పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన సుమారు రూ.5 లక్షలు విలువ చేసే మద్యం, సారాను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సమక్షంలో రూరల్‌స్టేషన్ పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బీవీజీ రాజు అందజేసిన సమాచారం ప్రకారం 50 బీర్లు, 30 లీటర్ల నాటుసారా, 900 మద్యం బాటిళ్ల ధ్వంసం చేసినవాటిలో ఉన్నాయి.

రేపు ఓం సదనంలో లక్ష కుంకుమార్చన

కొత్తవలస: శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఈ నెల 30న తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని ఓం సదనంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సదనం అర్చకుడు అంపోలు కిరణ్ కుమార్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి జరుగుతుందని, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమార్చనలో పాల్గొనాలని కోరారు.

రేపు విద్యుత్ కోత

లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోట విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఖాసాపేట ఫీడర్‌లో విద్యుత్ కోతలు అమలు చేస్తున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేడు గ్రామసందర్శన

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం జరుగనుందని ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు తెలిపారు. మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

దేవీబొమ్మ కూడలిలో పోలీస్ బీట్

శృంగవరపుకోట: శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలిలో బుధవారం పోలీస్ బీట్‌ను సీఐ వి.ఎన్ మూర్తి ప్రారంభించారు. ఈ పోలీస్ బీట్‌లో ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి సహక రించిన స్థానికులను అభినందించారు. గతంలో ఉన్న ఈ పోలీస్ బీట్ పాడవడంతో స్థానిక దుర్గాదేవి లైటింగ్ సప్లయిర్స్ సహకారం అందించారు. ఎస్.ఐ గంగరాజు వున్నారు.

మరియాదాసుకు నివాళులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట బాపూజీ సేవా సంఘ వ్యవస్థాపకుడు మోపాడ మరియాదాస్‌కు సంఘ సభ్యులు బుధవారం నివాళులు అర్పించారు. చిత్రపటానికి పూలమాలలు అర్పించారు. ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి రోగులకు రొట్టెలు, పాలు అందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, స్వామినాయుడు, మోపాడ చిన్ని కృష్ణ, వసంత సత్యారావు ఉన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

రాజాం: భారతీయ జనతా పార్టీ ప్రీ సభ్యత్వాలు నమోదు కార్యక్రమం సెప్టెంబరు రెండో తేదీ నుంచి చేపడుతుందని ఈ కార్యక్రమం విజయవంతం చేసేలా పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పట్టణ మండల అధ్యక్షుడు జొన్నాడ రంజిత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు పిలుపునిచ్చారు. రాజాం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదును చేయించు కోవాలని ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

పూర్తి అదనపు బాధ్యతలతో ఎస్‌టీవో

బొబ్బిలి: బొబ్బిలి సబ్‌ట్రెజరీ అధికారిగా ముదిలి ఆదినారాయణ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఇక్కడ ఎస్‌టీవోగా పనిచేసిన లక్కోజు సత్యనారాయణను పాడేరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయనగరం ఎస్‌టీవోగా పనిచేస్తున్న ఆదినారాయణను ప్రభుత్వం ఇక్కడ నియమించింది.

అక్టోబరులో విద్యా వైజ్ఞానిక మహాసభలు

బొబ్బిలి: మూడు రోజుల పాటు అక్టోబరు 6 నుంచి విజయనగరంలో ఏపీటీఎఫ్ విద్యావైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.బలరామనాయుడు తెలిపారు. బుధవారం రాత్రి బొబ్బిలిలో ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 14న బొబ్బిలిలో ఏపీటీఎఫ్ ప్రాంతీయ విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తామని, ఇందుకోసం అవసరమైన అనేకాంశాలపై సమావేశంలో చర్చించారు. ఏపీటీఎఫ్ నాయకులు సన్యాసినాయుడు, వెంకటనాయుడు, గంట సత్యనారాయణ, రామారావు, సత్యారావు పాల్గొన్నారు.

రైతులు సంఘంగా ఏర్పడితే ప్రయోజనాలు

శృంగవరపుకోట రూరల్: గ్రామాల్లో ఉండే రైతులు ఒక రైతు సంఘంగా ఏర్పడితే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని నాబార్డు డీడీఎం నాగార్జున అన్నారు. మండలంలోని తిమిడి గ్రామంలో ఎస్.కోట రైతుభారత్ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతు సంఘం సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. నాగార్జున మాట్లాడుతూ రైతుసంఘం ప్రయోజనాలు, విస్తరణ ఆవశ్యకత, రైతుభారత్ విజ యాలు, భవిష్యత్ ప్రయోజనాలు వంటి విషయాలు వివరించారు.

హామీ లేకుండానే ముద్ర రుణాలు

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 28: బ్యాంకులకు ఎటువంటి హామీ చూపించకుండానే ముద్ర రుణాలు పొందవచ్చునని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు పొందవచ్చునని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం కింద శిశు విభాగంలో రూ.50 వేల వరకూ, కిషోర్ విభాగంలో రూ. 5 లక్షల వరకూ, తరుణ్ విభాగం కింద రూ.10 లక్షల వరకూ ముద్ర రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. చిరు వ్యాపారులకు చిన్న, చిన్న యూనిట్లు స్థాపించే వారికి ముద్ర రుణాలు ఎంతో ప్రయోజనకరమన్నారు. పీఎం ఈజీపీ మంజూరు చేసే ఈ పథకం కింద 400 మందికి వెంటనే యూనిట్స్ స్థాపించాలని ఆదేశించారు. భూములు సాగు చే స్తున్నవారికే పంట రుణా లు మంజూరు చేయాలని, వన మహోత్సవ కార్యక్రమంలో బ్యాంకర్లు కూడా భాగస్వా మ్యులు కావాలన్నారు. జేసీ సేతు మాధవన్, ఎల్‌డీఎం రమణమూర్తి, నా బార్డు డీడీఎం నాగార్జున, ఎల్‌డీవో సునీ ల్, మెప్మా పీడీ సుధాకరరావు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

నిబంధనల మేరకు ఈవీఎంల రీ వెరిఫికేషన్

కలెక్టరేట్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో విజయనగరం పార్లమెంటు పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు చెకింగ్, రీ వెరిఫికేషన్ ప్రక్రియ ఆగస్టు 26 నుంచి 28 వరకూ నెల్లిమర్లలోని జిల్లాస్థాయి ఈవీఎం గౌడన్‌లో నిర్వహించామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు బొత్స అప్పలనర్సయ్య, బెల్లాన చంద్రశేఖర్ ఈవీఎంల చెకింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఎన్నికల కోసం దరఖాస్తు చేసిన మీదట జిల్లాలోని విజయనగరం పార్లమెంటు పరిధిలోని గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోని మూడు పోలింగు బూత్‌లకు చెందిన ఈవీఎంలు చెకింగ్ రీవెరిఫికేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26న గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ప్రక్రియకు దరఖాస్తు చేసిన అభ్యర్థి బొత్స అప్పలనర్సయ్య తరఫున బెల్లాన వంశీ ఏజెంట్‌గా హాజరై మాక్ పోలింగులో పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి 1,400 ఓట్లు నమోదు చేయడంతో పాటు, ఓటింగ్ అనంతరం వీవీ ప్యాట్‌లు లెక్కింపు చేపట్టగా, ఈవీఎంల్లో వచ్చిన ఫలితాన్ని పరిశీలించి వాటి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారని రాత పూర్వకంగా ఈ విషయాన్ని తెలిపారన్నారు. 27న బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 9 పోలింగ్ కేంద్రం రీ వెరిఫికేషన్ ప్రక్రియకు దరఖాస్తు చేసిన అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ స్వయంగా హాజరయ్యారన్నారు. తాను ఈవీఎం మాక్ పోలింగును కోరలేదని, చార్జింగ్ విషయంలో సందేహం ఉందన్నారు. వాటిని నివృత్తి చేయాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం మాత్రమే తనిఖీ ప్రక్రియ చేపట్టగలమన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థి తనకు ఆసక్తి లేదంటూ తెలియజేసి నిష్క్రమించడంతో మాక్ పోలింగ్ కొనసాగించలేదన్నారు. ఈ నెల 28న నెల్లిమర్ల అసెంబ్లీ సిగ్మెంట్ పరిధిలో వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టగా, అభ్యర్థి తరఫున ఏజెంట్‌గా బెల్లాన వంశీ హాజరయ్యారని, తాము ఈవీఎం మాక్ పోలింగు కోరలేదన్నారు.

పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న బేబీనాయన

రామభద్రపురం: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాజీ జిల్లా బోర్డు మెంబరు, కీర్తిశేషులు చొక్కాపు అప్ప లనాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంభిం చారు. అనంతరం ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతి నాయుడు, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభా స్కర్, చొక్కాపు రామారావు, జనసేన నాయకులు మహంతి ధనంజయరావు, తె లుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

బాడంగి: మత్తు పదార్థాలపై స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు బొబ్బిలి సీఐ నాగేశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేసుల్లో పట్టుబడితే 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. వీటికి అలవాటు పడి దొంగతనాలు, హత్యలు చేసే అవకాశం ఉందన్నారు. అందుకే విద్యార్థి దశ నుంచే బాగా చదువు కుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామదాసు, ఎస్ఐ తారకేశ్వరరావు, ఏఎస్ఐ కొండలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

విజయనగరం క్రైం: రహదారి భద్రతా నియామాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు సూచించారు. బుధవారం నగరంలోని ఏజీఎల్, నారాయణ కళాశాల విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, వాహన పత్రాలతో పాటు, లైసెన్సు తప్పనిసరిగా కలిగి వుండాలని అన్నారు. మైనర్లు వాహనాలతో పట్టుబడితే, సీజ్ చేస్తామని హెచ్చరించారు,. అతి వేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని మైనర్ నిండిన వారు రవాణాశాఖ కార్యాలయం ద్వారా లైసెన్సు పొందాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో ఎస్ఐ లోవ రాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి



సమస్యలను పరిష్కరిస్తున్న వేదిక చైర్మన్ సత్యనారాయణ

బొబ్బిలి: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వారి ఇళ్ల నుంచే పరిష్కరించుకోవచ్చని సమస్యల పరిష్కార న్యాయస్థానం (ఏపీఈపీడీసీఎల్-సీజీ ఆర్ఎఫ్) చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాల యంలో బుధవారం వినియోగదారుల సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొనే సమస్యలపై 1912 కాల్‌సెంటరుకు ఫిర్యాదు చేయాలన్నారు. అక్కడ పరి ష్కారం లభించకపోతే తమను ఆన్‌లైన్‌లో ఆశ్రయించవచ్చన్నారు. వినియోగదా రులకు ఎటువంటి ఖర్చులేకుండానే వారి ఫిర్యాదులపై పరిష్కారం చేస్తామ న్నారు. తాము చూపిన పరిష్కారానికి సంబంధించి 60 రోజుల్లోగా ఆర్డర్ కాపీ ఇస్తామని తెలిపారు. వినియోగ దారులు తాము ఎదుర్కొనే సమస్యలలో బిల్లింగ్ లోపాలు, తీగలు, కేబుల్స్ మర మ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు కాలిపో వడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, మీటర్లలో లోపాలు, అదనపు లోడు మంజూరు, కేట గిరి ఇతర అంశాల మార్పులు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ వంటి వాటిని తమ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. వేదిక సభ్యులు వీ జనార్దన్‌రావు, ఈఈలు ఆ వాల అనంతరావు, ధర్మరాజు, డీఈలు ఉదయభాను, శ్రీనివాసరావు ఉన్నారు.

అభివృద్ధి పథంలో ప్రజా ప్రభుత్వం: కోండ్రు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కోండ్రు

రాజాం/సంతకవిటి: అభివృద్ధి పథంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం చీపురుపల్లి రోడ్డులో ఒకప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని అనంతరం సంతకవిటి మండలం మండాకురిటి పంచాయతీలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజా గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. పార్టీ నాయకులు కొల్ల అప్పలనాయుడు, గురవాన నారాయణరావు, శాసపు రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్, సౌత్ జోన్ జట్ల ఆధిక్యం

విజయనగరం టౌన్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న ఇంటర్ జోన్ పురుషుల సీనియర్ క్రికెట్ మల్టీ డే పోటీల్లో సెంట్రల్ జోన్, సౌత్ జోన్ జట్లు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో తమ ప్రత్యర్థి జట్లపై విజయాలు అందుకున్నాయి. జిల్లా కేంద్రంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్, రెస్టాఫ్ ఆంధ్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రెస్టాఫ్ ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 85.5 ఓవర్లలో 333 పరుగులకు ఆలౌట్ కాగా, సెంట్రల్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 98.5 ఓవర్లలో 456 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో సెంట్రల్ జోన్ జట్టుకు 123 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్టాఫ్ ఆంధ్ర జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 38.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 169 పరుగులు సాధించింది.

- డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో సౌత్ జోన్- నార్త్ జోన్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో సౌత్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో 3 పాయింట్లు లభించాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌత్ జోన్ జట్టు 123.3 ఓవర్లలో 444 పరుగులకు ఆలౌట్ కాగా, నార్త్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 51.5 ఓవర్లలో 187 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో సౌత్ జోన్ జట్టుకు 257 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు మూడు రోజు ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 153 పరుగులు సాధించింది.

తోటపల్లి కాలువల ద్వారా నీరందించాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు



మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

పాలకొండ: తోటపల్లి కాలువల ద్వారా నీరందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఆగస్టు నెలాఖరు వచ్చినా కాలువల ద్వారా నీరందడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం పాలకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి ఉన్న కాలువల నుంచి ఆయకట్టు నీరందేదని తెలిపారు. నేటి పాలకుల విధానాలు, వ్యవస్థీకృత లోపాలు రైతులకు శాపంగా మారిందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న కాలువలను ఆధునీకీకరించే పేరుతో సంవత్సరాల తరబడి పనులు పూర్తికావడంలేదని, శివారు ఆయకట్టుకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఏడో బ్రాంచ్ పరిధిలో తుమరాడ, తంపటాపల్లి, బుక్కూరు, అట్టలి, వాటపాగు, తూడి, ఓని, లుంబూరు, గరుగుబిల్లి, పాలకొండ, వెలగవాడ, సింగన్నవలస, పరశురాంపురం, వడమ, కొండాపురం గ్రామాలకు నీరందడం లేదన్నారు. సమావేశంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు గులివిల్లి అప్పలనాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడు, బొత్స గౌరునాయుడు, బలగ దుర్గారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

వీరఘట్టం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ప్రసాదరావు, లెక్చరర్లు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించాలి

పాలకొండ: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు సెప్టెంబరు రెండోతేదీన నిర్వహించాలని జనసేన నాయకులు కోరారు. బుధవారం పాలకొండలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసేన నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకలపై చర్చించారు.

నీమాస్త్రంతో తెగుళ్ల నివారణ: ఏవో



నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న అవినాష్

సీతానగరం : నీమాస్త్రం పురుగు, తెగుళ్ల నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఏవో ఎస్. అవినాష్ తెలిపారు. బుధవారం మండలంలోని బుడ్డిపేటలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా నీమాస్త్రం తయారీపై రైతులకు ఏవో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో తెగుళ్ల నివారణ, పురుగుల నివారణకు నీమాస్త్రం పనిచేస్తుందన్నారు. నీమస్త్రం తయారీకి 100 లీటర్ల నీరు, కేజీ దేశి ఆవు పేడ, ఐదు లీటర్ల దేశి ఆవు మూత్రం, ఐదు కేజీల కొమ్మలు, రెమ్మలతో వేపాకుల ముద్ద, పిడికెడు పుట్ట మన్నును ముందు ఒక డ్రమ్ములో ఉంచి ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలుపుకోవాలని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ కులు పి.లక్ష్మణ్, బి.సుధీర్, సీహెచ్ వినాయ్ తేజ, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు మానుకోవాలి

● ఎంఈవోకు సీఐటీయూ నాయకుల వినతి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతానగరం: రాజకీయ కారణాలతో తొలగింపు చర్యలతో బెదిరింపులు, కక్ష సాధింపులు మానుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు.ఈ మేరకు బుధవారం మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి గవర వెంకటరమణ, మధ్యాహ్న భోజన పథకం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం మారిన తరువాత రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలోని పథకాల్లో పనిచేస్తున్న ఆశా, మిడ్ డే మీల్స్, స్కూల్ స్వీపర్లను తొలగించడంతో పాటు బెదిరించడం తగదన్నారు. సీతానగరం జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న మధ్యాహ్న పథకం నిర్వాహకులు, తామరఖండి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస గ్రామాల్లో స్కూల్ స్వీపర్లపై ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నారని, ఇలాంటి చర్యలు ఈ ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. కక్ష సాధింపులకు, తొలగింపులకు పాల్పడడం మానుకోవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా స్కీం వర్కర్లతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కూల్ స్వీపర్లు పి.ఉష, ఆర్.నిర్మల, ఎస్.పద్మ, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

కురుపాం: కురుపాంకు చెందిన కొత్తకోట శివ గోవిందరావు కుంబుకోట నుంచి ద్విచక్రవాహనంపై కురుపాం వస్తుండగా శివ్వన్నపేట సమీపంలో నాగమ్మ గుడి దగ్గరలో గుర్తు తెలియని వాహనం బుధవారం మధ్యాహ్నం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కురుపాం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖకు తరలించారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

రాయగడ: జాతీయ న్యాయసేవల విభాగం, ఒడిశా రాష్ట్ర న్యాయసేవల విభాగం ఆదేశాల మేరకు సెప్టెంబరు 14న మూడో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించ నున్నట్లు జిల్లా న్యాయసేవల విభాగం ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణ షడంగి తెలి పారు.జిల్లా పరిధిలోని రాయగడ, గుణుపురం, కాశీపూర్, బిసంకటక్, పద్మాపూర్ కోర్టుల్లో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న పలుకేసులను పరిష్కరించనున్నట్లు జిల్లా లీగల్‌సెల్ అథారిటీ తెలియజేసింది. బ్యాంకు ఖాతాలు, వాహన ప్రమాదాల పరి హారం, కుటుంబ సమస్యలు, కార్మిక వివాదాలు,భూవివాదాలు వంటి అనేక సమస్య లపై లోక్‌అదాలత్‌లో కక్షిదారులుపాల్గొని కేసులు పరిష్కరించుకోవాలని పేర్కొంది.

నేడు జాతీయ క్రీడా దినోత్సవం

రాయగడ: స్థానిక సద్భావన క్రీడా కాంప్లెక్స్ నుంచి రింగ్‌రోడ్డులోని మంగళ మందిరం వరకు జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని గురువారం ఉదయం ఏడు గంటలకు జిల్లా యంత్రాంగం భారీ ర్యాలీ నిర్వహించనుంది. ర్యాలీని కలెక్టర్ పారుల్ పట్వార్ జెండా ఊపి ప్రారంభిస్తారాని డీఐపీ ఆర్వో తెలిపారు.

ఏనుగుల సమస్య పరిష్కారానికి చర్యలు

●కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కొమరాడ:ఏనుగుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని వన్నాం గ్రామంలో రెండు రోజుల కిందట ఏనుగుల దాడిలో మృతి చెందిన శివుడు కుటుంబాన్ని జగదీశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావలసిన నష్ట పరిహారాన్ని త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌దేవ్,టీడీపీమండల కన్వీనర్ శేఖర్‌పాత్రుడు,సర్పంచ్ విజయ లక్ష్మి, కూటమి నాయకులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో ప్రజాదర్బార్

కురుపాం రూరల్: మండలంలోని నీలకంఠాపురంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, నాయకులు పాల్గొన్నారు.



కొమరాడ: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రోడ్డుపై మట్టి.. రాకపోకలకు అవస్థలు

● భామినిలో జలజీవన్‌మిషన్ పైపులైన్ పనులు



రోడ్డుపైనే మట్టిని విడిచిపెట్టిన దృశ్యం

భామిని:భామినిలో జలజీవన్‌మిషన్ ద్వారా తాగునీరు అందించేందుకు చేపట్టిన పైపులైన్ పనులతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన కేబుళ్లు ఎక్కడి కక్కడే తెగిపోతుండడంతో సిగ్నల్స్ అందడంలేదని పలువురు వాపోతున్నారు. మూడు రోజులుగా భామినిలో జరుగుతున్న పనుల్లో భాగంగా పైపులైన్ వేశాక కప్పిన మట్టి ఎక్కడ పడితే అక్కడ చిందరవందరగా విడిచిపెడుతున్నారు. ఇదే సమయంలో వర్షం కురవడంతో ఆ మట్టి మొత్తం రహదారిపై రావడం, బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి రోడ్డుపక్కనే మట్టిని కుప్పలు తెప్పలు వదలకుండా చదును చేయాలని పలువురు కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్



ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

బెలగాం: పార్వతీపురంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సెక్యూరిటీ గార్డ్ తదితర కార్మికులతో ఆసుపత్రి వద్ద నిరసనతెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, అప్పుల పాలవుతున్నారని తెలిపారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సింహాద్రి దుర్గారావు, కుమారమ్మా, చంద్రమౌళి, సంచాన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

● ఐటీడీఏ డిప్యూటీ డీఈవో నారాయుడు



ఆశ్రమ పాఠశాలలో పరిశీలిస్తున్న నారాయుడు

సీతంపేట రూరల్: మెనూ పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ డిప్యూటీ డీఈవో నారాయుడు కోరారు. చదువుల్లో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. బుధవారం మండలంలోని చినబగ్గ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. విద్యార్థుల నోట్, వర్క్‌బుక్స్‌ను ఎప్పటికప్పుడు కరక్షన్ చేస్తుండాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను ఏ, బీ, సీ,డీ గ్రూప్‌లుగా విడదీసి బోధించాలని తెలిపారు. అనంతరం నుంచి పూతికవలస, గోరపాడు, గూడంగి కాలనీ జీపీఎస్ పాఠశాలలను తనిఖీ చేశారు. కార్య క్రమంలో సీఎంవో చిరంజీవులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన



కొత్తపల్లిలో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈవో నాగభూషణరావు

గరుగుబిల్లి: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా బోధించాలని ఎంఈవో ఎన్.నాగభూషణరావు సూచించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో భోజన పథ కాన్ని ఆయన పరిశీలించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపాలు లేకుండా చర్యలు తీసుకో వాలని కోరారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమావేశం

కురుపాం: కురుపాంలో బీజేపీ సభ్యత్వ నమోదు పై ఆ పార్టీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు నడుకూరు ధూళికేశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గౌడు బాలంకి,ఊయక ఆనందరావు,కొత్తకోట సతీష్, ఎన్.శ్రీనివాసరావు,నిమ్మక ఆకాష్ పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడులు

●ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ రాజ్యలక్ష్మి

గరుగుబిల్లి: సాంకేతిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ ఆర్.రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఉద్యాన కళాశాలలో భారత వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ వ్యవసాయ ఉన్నత విద్యా పథకంలో భాగంగా బ్లెండెడ్ లెర్నింగ్ ప్లాట్ ఫార్మ్‌పై ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆచార్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక పద్ధతులపై అవగాహనకోసం శుక్రవారం వరకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించే వంగడాలు, తదితర ఉత్పత్తులపై కళాశాల విద్యార్థులకు అవగాహ కల్పిస్తే క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందన్నారు. వంగ, టమాటా పంటల్లో సంకర రకాల విత్తనోత్పత్తులపై అవగాహన కల్పించారు. రైతులు ఆర్థికంగా బలోపేతానికై పథకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.ప్రదీప్‌కుమార్, బీవీజీ ప్రసాద్, ఎం.అనిత, హెచ్.అరుణకుమారి, తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఉల్లిభద్రకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

గరుగుబిల్లి : ఉల్లిభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 327 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు పీసీహెచ్ శ్రీనివాసరావు, పీఈటీ బి.శ్రీనివాసరావులు బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నుంచి రాష్ట్రస్థాయిలో 29 మంది జాతీయ స్థాయిలో ఎనిమిది మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు.ఈ మేరకు గుంటూరు జిల్లాలో జరిగిన బేస్‌బాల్ అండర్-17లో బాలురులో ప్రథమ, బాలికల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కర్నూలులో జరిగిన బేస్‌బాల్ అండర్-14లో బాలురులో ద్వితీయ స్థానం, బాలికల్లో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



క్రీడల్లో ప్రతిభకనపరిచిన బాలికలతో ఉపాధ్యాయులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: ఎన్‌కేరాజపురం, సీఎల్‌నాయుడునగర్, సీతంపేటరోడ్డు, నీలమ్మకలనీ, ఏరియా ఆసుపత్రి, ఎంఎం నగర్, యాతవీధి, వేమకోటవారివీధి, రామకళా మందిర్ వీధులకు విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవి పాలకొండ టౌన్ ఫీడర్‌పై నీలంకాలనీలో ఉన్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

వీరఘట్టం: వీరఘట్టం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగే ప్రజావేదిక కార్యక్రమానికి సంబంధితశాఖాధికారులు హాజరుకావాలని కోరారు

ఎయిడ్స్‌పై అవగాహన

కురుపాం: కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై విద్యార్థులకు వైడీవో నెట్ వర్క్ ఆర్గనైజర్, ట్రాన్స్ జెండర్ గీతరాణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌కు విరాళం



చంద్రబాబునాయుడుతో మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు: తన రెండు నెలలు జీతాన్ని కొంత భాగం తిరుపతి వెంకటేశ్వర స్వామికి, సాలూరులో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్‌కు కొంత విరాళం ఇవ్వనున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటించారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో సాలూరులో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్‌కు సంబంధించి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్ లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చినట్లు చం ద్రబాబుకు తెలియజేసినట్లు తెలిపారు. గురువారం కేంద్రమంత్రితో మాట్లాడాల్సిన పలు విషయాలు గురించి కూడా తనకు సలహాలు సూచనలు ఇచ్చినట్లు చెప్పారు..

డీడీ కార్యాలయ తరలించ వద్దు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ కేంద్రంగా నిర్వహిస్తున్న జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయం తరలింపు నిలుపుదల చేయాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు.ఈ మేరకు బుధవారం ఐటీడీఏ పీవో వీవీరమణకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయం శ్రీకాకుళం తరలిస్తే ఉపాధ్యాయులు, ఆదివాసీలు ఇబ్బందులుపడతారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మోహన్‌రావు పాల్గొన్నారు.

కుక్క కాటు మందులు అందుబాటులోఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు



ఆస్పత్రిలో మాట్లాడుతున్న జగన్మోహనరావు

సాలూరు రూరల్: పీహెచ్‌సీలో పాము,కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు తెలిపారు. బాగువలస పీహెచ్‌సీని మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీల్లో రాత్రి వేళల్లో వైద్యులు,సిబ్బంది తప్పనిసరిగా ఉండాలన్నారు. బాగువలస పీహెచ్‌సీ పనితీరు మెరుగుపడడానికి పలు సూచనలు చేశారు. అలాగే ఆయన గర్భిణుల వసతి గృహన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. సాలూరు బాలుర వసతిగృహన్ని పరిశీలించి సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఆయనతో వైద్యాధికారులు రవికిరణ్,ప్రియాంక.సూపర్‌వైజర్ జయగౌడ్‌ఉన్నారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు

● పాలకొండ డీఎల్‌డీవో గోపాలకృష్ణ



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

సీతంపేట రూరల్: పీఎం జన్ మాన్ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు పాలకొండ డీఎల్‌డీవో గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమంకోసం పీఎం జన్‌మాన్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. ఈ పథకం కింద 11 రకాల మౌలిక సదుపాయాల పై దృష్టి సారించి గిరిజన సాధికారతకు కృషి చేయాలని కోరారు. పీవీటీజీల ఆవాసాల్లో గ్రామసభలు నిర్వహించి వారికి అవసరమైన పక్కా ఇళ్లు, మంచినీరు, విద్యుత్, రహదారులు, విద్య వంటి అంశాలను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె. గీతాంజలి, ఈవోపీఆర్డీ సత్యం, పరిపాలనాధికారి మాన, మండల ఇంజనీరింగ్ అధికారి కిరణ్,ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పాపారావు,హౌసింగ్ ఏఈవెంకటేష్ వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ ఎస్ఐగా నర్సింహమూర్తి

సాలూరు రూరల్: సాలూరు సర్కిల్‌లో ఎస్ఐల బదిలీలు మళ్లీ మారాయి. సాలూరు రూరల్ ఎస్ఐగా పి.నర్సింహమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత సాలూరు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణను సాలూరు పట్టణానికి బదిలీలు చేశారు. సాలూరులో ఉన్న సురేష్‌ను సాలూరు రూరల్ ఎస్ఐగా, మక్కువలో ఉన్న నర్సింహమూర్తిని పాచిపెంట ఎస్ఐగా బదిలీలు చేశారు.సాలూరు పట్టణ ఎస్ఐగా బదిలీ అయిన ఎం. వెంకటరమణను మక్కువకు బదిలీచేశారు. అక్కడ పనిచేస్తున్న నర్సింహమూర్తిని సాలూరు రూరల్‌కు బదిలీ చేశారు. సాలూరుకు తొలుత బదిలీ అయిన సురేష్‌ను పాచిపెంటకు బదిలీ చేశారు. పాచిపెంట ఎస్ఐగా ఉన్న పొదిలాపు నారాయణరావును వీఆర్‌కు పంపారు. సాలూరు రూరల్ ఎస్ఐగా నర్సింహమూర్తి, మక్కువ ఎస్.ఐగా ఎం. వెంకటరమణలు బాధ్యతలు స్వీకరించారు.